# అమ్మో! ఢిల్లీ!!

- కందుకూరి వెంకటమహాలక్ష్మి

రైలు దిగి స్టేషన్‌లో నిలబడ్డ మాధురి చక్రాల్లాంటి కళ్ళని బండి చక్రాలంత చేసి వింతగా నాలుగు వైపులా చూడసాగింది.

కంపార్ట్‌మెంట్ ఎదురుగా నిలబెట్టి సామాను దింపుతున్న గిరి "సామాను జాగ్రత్త మాధురీ! దిక్కులు చూడకు. ఇది ఢిల్లీ!" అంటూ పెట్టిన కేకకి ఉలిక్కిపడి తలవంచి దింపిన సామాను లెక్కపెట్టసాగింది.

పోర్టరు నెత్తిని సామాను పెట్టి స్టేషన్ బైటికి వస్తున్న గిరి వెనకే ఓ బేగ్ భుజానికి తగుల్చుకుని నడవసాగింది. పోర్టరు ముందు గబగబా నడుస్తుంటే గిరి అతన్ని అనుసరిస్తున్నాడు. ఎదురుగా వస్తున్న జనాన్ని తప్పించు కుంటూ పరుగులాంటి నడకతో గిరి వెనక నడవడం మాధురికి చాలా కష్టంగా ఉంది.

అమలాపురం దగ్గర చిన్న పల్లెలో పుట్టి పెరిగిన మాధురి రైలెక్కడం తొలిసారి. రైళ్ళు, విమానాలవంటివి సినిమాల్లోనే చూసింది. సినిమాకెళ్ళాలన్నా, ఖరీదైన సామాను కొనాలన్నా అమలాపురం వెళ్ళేవారు. అదే వారికి పెద్ద పట్టణం.

అలా పెరిగిన మాధురి గిరితో పెళ్ళయి కాపరానికి వస్తూ తొలిసారి రైలెక్కింది. అది కూడా సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్. భర్తతో ఢిల్లీ రావడం ఎంతో హుషారుగా, తమాషాగా వుంది. రైలు శరవేగంతో పరిగెడుతున్నప్పుడు భయంతో, కళ్ళు తిరిగినట్లయి ఒక్కోసారి గిరిని చుట్టుకు పోయేది.

త్రోవంతా అమాయకత్వంతో, ప్రతిదీ వింతగా చూస్తూ వేసే ప్రశ్నలకు వేళాకోళంగా ఇంతది అంతచేసి మాధురికి చెప్పి ఆమెని భయపెట్టి, ఆట పట్టిస్తూ వచ్చాడు. అసలే పల్లెలో పెరిగిన మాధురికి గిరి మాటలు నిజంగానే భయాన్ని కలిగించసాగాయి.

మాధురి తల్లిదండ్రులు కాస్త పూర్వకాలపు మనుష్యులు కావడంతో, వాళ్ళ పిల్లల్ని కూడా అదే పద్ధతిలో పెంచడం వల్ల మాధురికి ఈ వాతావరణం చాలా చిరాకుగా వుంది.

పెళ్ళి కుదరగానే బంధుమిత్రులు అంతా మాధురి అదృష్టాన్ని తెగపొగిడేసారు. ఢిల్లీ అనగానే, "అమ్మో! ప్రధానమంత్రిని, మినిష్టర్లని రోజూ చూస్తావన్నమాట! కుతుబ్ మీనార్, రెడ్‌ఫోర్ట్ చూస్తావన్నమాట!" అంటూ ఆశ్చర్యంగా, ఆనందంగా పొగిడేస్తుంటే గర్వంగా వాళ్ళకేసి చూసేది. అలా ఎన్నో కలల్ని కళ్ళనిండా నింపుకొచ్చిన మాధురికి భర్త చెప్పే మాటలు, ఆ జనసందోహం కంగారుని కలిగిస్తోంది.

రామకృష్ణాపురంలో రెండు గదుల ఇల్లది. క్రింది భాగం కావడంతో ఎదర వెనక ఖాళీ స్థలం వుండడం, అందులో కొన్ని మొక్కలు కూడా వుండడంతో ఇల్లు చాలా సదుపాయంగా వున్నట్లనిపించి తృప్తిగా వుంది మాధురికి.

తెచ్చిన సామానంతా నీట్‌గా సర్దేడు గిరి. వంటకి కావలసిన సామాను, సరుకులు తెచ్చి పడేశాడు.

"మాధురీ యిలారా!" అన్న గిరి పిలుపుకి 'ఎందుకండీ!' అంటూ వచ్చిన మాధురితో "మెళ్ళోంచి ఆ పుస్తెల గొలుసు, నల్లపూసలు, బంగారం గాజులు తీసి యిలా ఇవ్వు" అనగానే ఆశ్చర్యపోతూ 'మంగళ సూత్రాలు మెళ్ళోంచి తీసెయ్యడమేమిటండీ! తప్పు, తప్పు' అంటూ మంగళసూత్రాలని కళ్ళ కద్దుకుంది.

'చూడు మాధురీ! ఇది మీ వూరు కాదు- మెడనిండా కట్టల, కట్టల నగలేసుకుని వీధుల్లో తిరగడానికి. పైగా అలా నగలేసుకుని తిరిగే వాళ్ళని వింతగా చూస్తారు. ఇక్కడ దొంగల భయాలెక్కువ. అలా నగలేసుకుని వీధిలోకి వెళ్తే, నిన్నే కాదు, పక్కనున్న నన్ను కూడా పొడిచి చంపుతారు. ఇంట్లో వేసుకుంటే పనివాళ్ళు ఆచూకీ యిస్తే, ఇంట్లో మగవాళ్ళు లేనప్పుడు వచ్చి హత్యలు చెయ్యడమో, దోచుకుపోవడమో చేస్తారు. నేను చెప్పేది విని ఆ నగలన్నీ యిచ్చేసి నీ పాతివ్రత్యానికి భంగమనుకుంటే ఓ పసుపుతాడులో మంగళసూత్రా లేసుకో!" అని నగలన్నీ తీయించి లాకర్‌లో పెట్టి వచ్చాడు.

ఒక్కర్తివీ బైటికెళ్ళొద్దని, తను లేనప్పుడు ఎవరు తలుపు కొట్టినా తియ్యొద్దని, ఆఖరికి మంచినీళ్ళడిగినా అపరిచితులకి యివ్వొద్దని, క్రింది వాటా ఇళ్ళవాళ్ళకి దొంగల భయం మరీ ఎక్కువని, ఇక్కడ అలా దొంగలు దోచుకుపోతున్నా పొరుగువాళ్ళు భయంతో పట్టించుకోరని, చెప్తున్న భర్త మాటల్ని గుండె చేత్తో పట్టుకుని వినసాగింది. 'ఇలాంటి ఊరని తెలిస్తే ఈ పెళ్ళికి ఒప్పుకోకపోదునురా దేముడా!' అనుకుని, భర్త మాటలకి తలూపడం తప్ప ఏం జవాబివ్వలేదు.

శలవలయిపోయి ఆఫీసుకి వెళ్తున్న గిరి, భార్యకి మళ్ళీ చెప్పిన జాగ్రత్తలే చెప్పి, లోపల గడియ వేసుకోమని సాయంత్రం ఆరుగంటల వేళ తను వచ్చి మూడుసార్లు బెల్లు వాయిస్తానని, అప్పుడు కిటికీలోంచి చూసి తలుపు తియ్యమని చెప్పి వెళ్ళాడు.

భర్త వెళ్ళగానే వీధి, దొడ్డితలుపులతోపాటు కిటికీలు కూడా మూసేసుకుని లోపలే కూర్చుంది మాధురి.

"మా ఊళ్ళో ఎప్పుడూ ఏ తలుపులూ వేసుకొని ఎరగంబాబూ! ఇదేం వూరురా నాయనా. ఇది ఇల్లా, జైలా? ఏం పట్నాలో! సుఖంలేదు. స్వేచ్ఛలేదు. దూరపు కొండలు నునుపుట" అనుకుంది.

సాయంకాలం భర్త వచ్చేదాకా సెకనులు లెక్కిస్తూ బితుకు, బితుకు మంటూ కాలం గడిపింది. నిద్రపోదామన్న భయం కంటిమీద కునుకుని రానివ్వటం లేదు.

ఆరుగంటలకి ఇంటికొచ్చిన భర్తని చూడగానే కంటనీరెడుతు 'నేనీ ఊళ్ళో వుండలేను ఆంధ్రా వెళ్ళిపోదాం" అంటూ గొడవ ప్రారంభించిన భార్యతో 'పిచ్చిదానా! నా చదువుకి తగ్గ ఉద్యోగం అక్కడ దొరకదు. ఇలాంటి పట్నాల్లోనే దొరుకుతాయి. ఏ పట్నాల్లో నయినా వాతావరణం యిలాగే వుంటుంది. నెమ్మదిగా అలవాటవుతుంది. పుస్తకాలు చదువుకో లేదా కుట్లూ, అల్లికలతో కాలక్షేపం చెయ్యి" అని అనునయించాడు.

భర్త ఆఫీసుకెళ్ళిన గంటకి తలుపుతట్టిన శబ్దం కాగానే మాధురి గుండె దడదడలాడి పోయింది. కిటికీ తెరిచి చూద్దామన్నా ధైర్యం చాలటం లేదు. భయం భయంగా వెళ్ళి తలువు రంధ్రంలోంచి బైటికి చూసింది. ఎవరో పెద్ద గెడ్డం, కాషాయ రంగు బట్టలతో వున్న ఓ వ్యక్తి నిలబడి వుండటం కనబడింది. మాధురిపై ప్రాణాలు పైకే పోతున్నట్లని పించాయి. భయంతో నీరసం కమ్ముకు రాసాగింది.

కాస్సేపటికి తలుపు తట్టడం ఆగి పోయింది. మళ్ళీ తలుపు రంధ్రంలోంచి చూసి బైట ఎవ్వరూ కనపడక పోయే సరికి "హమ్మయ్య!" అనుకుంది.

సాయంత్రం భర్త రాగానే తు.చ.తప్పకుండా అన్నీ చెప్పింది. దానికి గిరి "కొన్నాళ్ళు జాగ్రత్తగావుండు. తలుపు తెరవలేదని, పిరికి దానివని తెలిసి కనిపెట్టి మళ్ళీ మళ్ళీ రావచ్చు. "అని చెప్పగానే భయం మరీ ఎక్కువయింది మాధురికి.

కాపరం పెట్టి నెల్లాళ్ళు కావస్తోంది. మాధురీ వాతావరణానికి అలవాటు పడ్డట్టుంది గిరికి.


బాస్ ఊళ్ళో లేనందున మూడుగంటలకే ఇంటి కొచ్చిన గిరికి ఇల్లు తాళం వేసివుండడంతో కంగారు పడ్డాడు. "ఎక్కడికి వెళ్లి వుంటుంది?" అని ఆలోచించ సాగాడు. నాలుగయింది మాధురిరాలేదు. ఇక ఆ ఎండలో నిలబడలేక పక్క వీధిలో వున్న హెూటల్ వైపు నడిచాడు.

కాఫీతాగుతున్న గిరికి పిచ్చి ఆలోచనలు బుర్రలో కొచ్చి తొలచసాగాయి. కాఫీరుచి తెలీటంలేదు. మాధురి ఎక్కడికి వెళ్ళి వుంటుంది? తనూ ఎవరిళ్ళకీ తీసు 'కెళ్ళలేదు! అన్న ఆలోచనలు అతని బుర్రని వేడెక్కిస్తు న్నాయి. ఆమె మీద అనుమానమూ కలిగింది. ఆ

ఆలోచనల్లో ఇంటివైపు నడిచాడు.

ఇంటి తాళం తీసివుంది. తలుపు తట్టగానే మాధురి తలుపు తెరిచింది. ఓ పక్క ఆమె మాటలకి జవాబు చెప్తూనే రెండోపక్క ఆమెని కనిపెడుతూ ఆలోచించ సాగాడు.

మర్నాడు కావాలనే రెండు గంటలకి ఇంటి కొచ్చిన గిరికి మళ్ళీ ఇంటికి తాళంకప్ప కనపడటంతో 'ఎక్కడికి వెళ్లిందీ మనిషి?'' అన్న ఆలోచనతో పాటు అనుమానం కూడా కలిగింది. రెండు గంటలసేపు వీధి బయటే నిలబడి చూసి-విసుగొచ్చి మళ్ళీ హొటల్ వైపుకి వెళ్ళి ఆరుగంటలదాకా కూర్చుని తిరిగి వచ్చేసరికి నిన్నటిలాగే తాళంతీసి వుండటం, లోపలికి రాగానే మాధురి మామూలుగా కబుర్లు చెప్పడంతో గిరికి వళ్ళు మండటమే కాకుండా, కాస్త అనుమానంగా చూస్తూ "ఈ ఆడాళ్ళు ఎంతకేనా తగుదురు'' అనుకు న్నాడు.



"ఈ రోజు కూడా చూద్దాం'' అనుకుని ఆఫీసు కని చెప్పి బయలుదేరి వెళ్ళిన మరో గంటకి తిరి గొచ్చిన గిరికి రోజులాగే ఇల్లు తాళం పెట్టి వుండటం చూడగానే కళ్ళు చింత నిప్పులే అయ్యాయి. వళ్ళం తాకారం పూసుకున్నట్లు మండసాగింది.

ఆ మర్నాడు ఉదయం ఆఫీసుకెళ్తున్నానని చెప్పి బైటి కొచ్చి మాధురికి కన బడకుండా పక్కగా నిలబడి ఇంటికేసే చూడసాగాడు. మరో అయిదు నిమిషాలకి మాధురి బైటికొచ్చి ఇటూ, అటూ చూసి తలుపు తాళం పెట్టి ఇంటి వెనక వైపుకి వెళ్ళింది. గిరికూడా రోడ్డు మీద ఆమెకి కనపడకుండా ఇంటి వెనక్కి వెళ్ళాడు. మాధురి వెనకనుంచి ఇంటి లోపలికి వెళ్ళడం చూడగానే ఆశ్చర్యంతో కనుబొమ్మలు రెండూ ముడివేసి ఎందు కిలా చేస్తోందని ఆలోచించ సాగాడు. వెంటనే ఏదో తట్టినట్లు "అమ్మో! తెలివైన బుర్రే! బైట తాళం పెట్టి తన బాయ్ ఫ్రెండ్‌ని వెనక తలుపు లోంచి ఇంట్లోకే రప్పిస్తోందన్నమాట. దీనికీ రోజు మూడింది. దీన్నివేళ పట్టి తీర తాను!'' అనుకుంటూ అక్కడే నిలబడి కనిపెట్ట సాగాడు. మధ్యాహ్నం పన్నెండు దాటింది ఎవ్వరూ లోపలినుంచి రావడం గానీ, వెళ్ళడంగానీ కనపడలేదు. గిరికి చాలా ఆశ్చర్యంగా వుంది. "ఏమయివుంటుంది? ఒకవేళ పక్క ఫెన్సులోంచి లోపలికి ఆ బాయ్‌ఫ్రెండ్‌గానీ వెళ్ళలేదు కదా?'' అన్న అనుమానంరాగానే ఓ అయిడియా తట్టింది.

వీధి తలుపు ఎలాగా తాళం పెట్టి వుంది గనక నేను వెళ్ళి దొడ్డి పక్క తలుపు కొడితే తెరవకేం చేస్తుంది? ఎవడేనా లోపలుంటే వాడు రావలసింది ఆ తలుపునుంచే కదా! అప్పుడు యిద్దర్నీ పట్టి వీళ్ళ పని పడతాను అనుకుని దొడ్డి తలుపు దబదబా బాదాడు ఆవేశంతో.

తలుపు కొట్టిన కొద్దిసేపటికి మాధురి వచ్చి గ్రిల్సు లోంచి గిరిని చూసి తెల్లబోతు తలుపు తీసింది. "ఇప్పు డొచ్చారేమిటి? అయినా దొడ్డి తలుపంట రావడ మేమిటి?''

అంటూ ఆశ్చర్యపోతుంటే గిరి ఆమెనే పరీక్షగా చూస్తూ, తరవాత తన కళ్ళని గదిలోకి పోనిచ్చి నాలుగు వైపులా కలయ తిప్పి, తన అనుమానానికి సాక్ష్యాధారాలకోసం వెతకసాగాడు. ఎక్కడా ఏ అలికిడీ లేదు. పైగా మాధురి నిద్ర కళ్ళు ఆమె మంచి నిద్రలోంచి లేచినట్లు చెబుతున్నాయి. అయినా అనుమానం చావక తలుపులు గడియపెట్టి మాధురికి అనుమానం కలగకుండా వంటిల్లు, స్నానాలగది కూడా చూసి వచ్చి కూర్చుంటూ "ఇవాళ తల నొప్పిగా వుండి అర్ధరోజు శలవడిగి వచ్చేసాను'' అంటూ మంచం మీద వాలగానే మాధురి గిరి తలకి మందు రాస్తూ, 'ఏమండీ! సాయంకాలం ఎటన్నా వెళ్దామండీ! ఇంట్లో రోజల్లా గడపడం బోర్‌గావుంది. ఇవాళ చక్కగా తొందరగా మీ రొచ్చేసారు''అంటూ అతని భుజం మీద వాలగానే ఇంకా అనుమానపు పురుగు బుర్రలో తొలుస్తున్న గిరి ఆమె మాటలకి జవాబు యివ్వకుండా "తాళం ఎందుకేసావు?!'' అని అడగ్గానే- "అమ్మో! ఆ రోజు ఆ గడ్డపతన్ని చూసిన దగ్గరనుంచి నా గుండెల్లో దడ మీ కెలా చెప్పను? పైగా మీరూ అన్నారు కదా! అలా కొన్ని రోజులొచ్చి కనిపెట్టి ఇంట్లోకి జొరబడతారని! అందుకు నాకో ఆలోచన కలిగింది. మీ రెళ్ళగానే వీధి తలుపు తాళం పెట్టి, వెనకనుంచి లోపలికొచ్చి గడియ వేసుకుని హాయిగా మీరొచ్చే వేళకి మళ్ళీ ఆరుగంటలకి తాళం తీస్తున్నాను. ఇంటికి తాళం వేసివుంటే ఏ దొంగా వచ్చి తలుపు తట్టడు కదా! పైగా నాకు నిద్రకూడా కొంచెం ఎక్కువే నండీ! ఢిల్లీ వచ్చినదగ్గరనుంచి మీరు ఏవేవో చెప్పి భయపెట్టేస్తున్నారు. దాంతో పడుకున్నా నిద్ర పట్టేది కాదు. ఇలా తాళం వేసుకుంటున్న దగ్గరనుంచి హాయిగా నిద్రపోతున్నానండీ! మీతో చెప్తే వేళాకోళం చేస్తారనీ...'' అంటూ అమాయకంగా చెప్తున్న మాధురి మాటలకి గిరి బుర్రలోని అనుమానపు పురుగు రెక్కలొచ్చినట్లు ఎగిరిపోవడమే కాకుండా, తప్పు చేసిన వాడిలా, పశ్చాత్తాపంతో భార్యని దగ్గరకి తీసుకున్నాడు.

"తొందర పడి నా మనసులోని భావాలని, ఆవేశాన్ని బైటపెట్టివుంటే??'' అనుకున్న గిరి అందుకే "నిదానం ప్రధానం'' అన్నారు పెద్దలు అనుకున్నాడు మనసులోనే తనని తాను నిందించుకుంటూ. అతని అనుమానం మాధురికి తెలిసి వుంటే?..

●●●